
# ఎప్పుడు సంపద గలిగిన...



_ఉమైరాంగి

"అమ్మా, మీ ఉత్తరా లివిగో." ఆఫీసు ప్యూను జకరయ్య మూడు కవర్లని, ఓ కార్డుని తెచ్చి శ్యామల బల్లమీద పెట్టి వెళ్లిపోయాడు.

"అమ్మో! అన్ని ఉత్తరాలే!?" సునంద కళ్లలో సంభ్రమాశ్చర్యాలు తొంగిచూశాయి.

సాధారణంగా శ్యామలకు ఉత్తరాలు రావు. అటువంటిది ఒక్కసారిగా అన్ని ఉత్తరాలు రావడం ఆ సెక్షన్‌లో అందరినీ ఆశ్చర్యపరిచిందనే చెప్పాలి.

"మన లేడీ క్లర్క్‌కి ఈ రోజు చాలా కవర్లు వచ్చాయే?! ఎక్కడి నుంచి వచ్చాయో? ఏమండోయ్, శ్యామల గారూ, ఏమిటి విశేషం?" హనుమంత రావు వ్యంగ్యపూరితమైన చిరునవ్వుతో అడిగా డలా.

"అమ్మగారి వైపునుంచో, అత్తగారి వైపునుంచో పండుగకు రమ్మనో, యోగ క్షేమాలు తెలియచేయమనో వచ్చి ఉంటాయి. దీనిలో వింతపడాల్సిందేమిటి?" సెక్షన్ హెడ్ కృష్ణమూర్తి గంభీరస్వరంతో జవాబిచ్చాడు.

"నేను చూడవచ్చా... లేక..."

తన సీటులోంచి లేచి శ్యామల దగ్గరగా వస్తూ సందేహాన్ని వ్యక్తంచేస్తూ నవ్వింది సునంద. సునందకూ అడపా దడపా లెటర్సు వస్తుంటాయి గాని, ఒక్కసారిగా అన్ని-అంటే నాలుగు-ఉత్తరాలు ఎప్పుడూ రాలేదు మరి! వచ్చేవైనా "మా అమ్మకి ఒంట్లో బాగాలేదు. తరుచూ ఫిట్సు వచ్చి పడిపోతూ ఉన్నది. రక్తపుపోటు ఉందట. ఎన్ని మందులు వాడినా గుణం కనిపించటం లేదు" అని తండ్రి వ్రాస్తే, "నువ్వు అదృష్టవంతురాలివే, సునందా, చక్కగా చదువుకున్నావు. చదివిన చదువుని వినియోగించుకుంటూ ఉద్యోగం చేసుకుంటున్నావు. నేనూ ఉన్నాను, ఎందుకూ? వెలిసిపోయిన పాత చీరలా, పిల్లల రోగాలతో, దాస్యంతో క్షణం తీరకుండా, మీ బావ గారి చిరుబుర్రులతో ఈ జీవితం మీదే విరక్తి పుట్టు తున్నదే. నీకే బాధలు లేవుకదా!" అని ఉత్తరాల్లో వాపోయే అక్కగారూ, "చిన్నక్కా, నాన్న పంపే డబ్బు చాలడంలేదే. నువ్వుకూడా ఏమైనా పంపిస్తుండవే. నా ఫ్రెండ్సంతా డబ్బుని ఎలా ఖర్చుపెడతారనుకున్నావూ? అందర్లోకీ మరీ నేనే హీనంగా ఉంటాను ఖర్చులో. ఈ నెల తప్పకుండా డబ్బు పంపిస్తావుకదూ?" ఈ ధోరణిలో ఉంటుంది తమ్ముడి ఉత్తరం. అందరికీ తన ఉద్యోగం మీద, తను సంపాదించే డబ్బుమీద ప్రేమ. అంతేకాని, తన సుఖం, సంతోషం ఎవరికీ అక్కర్లేదు. అందుకే తనకి ఉత్తరం వచ్చిందంటే భయపడుతుంది సునంద.

ఆ అమ్మాయి ఉద్యోగంలో చేరి ఇంకా ఏడాది కాలేదు. శ్యామల గురించి తెలుసుకున్నది కూడా చాలా తక్కువే. ఆమె అందంగా, నాజూగ్గా ఉంటుందని, ఎప్పుడూ సరదాగా తిరుగుతుందని, నలుగురితో హాయిగా నవ్వుతూ తిరిగేయ గలదనీను. ఇంత సరదాగా తిరిగే ఈమెకు ఫ్రెండ్సుకి లోటేమిటి? ఆ ఉత్తరాల్ని ఆ బాపతువే ఎందుకు కాకూడదూ అనుకున్న సునంద స్త్రీ సహజమైన కుతూహలంతో "ఆ ఉత్తరాలు చూడ వచ్చా?" అంది. అలా అంటే 'ఆమె కంగారు పడుతూ ఆ ఉత్తరాల్ని భద్రంగా దాచుకుంటుంది. అప్పుడు మంచి కాలక్షేపంగా ఉంటుంది ఆఫీసులో వాళ్లకు' అనుకుంది సునంద. కాని, ఆమె అంచనా తప్పుచేస్తూ — "అలాగే చదువు, సునందా. నా చెల్లెలులాంటి దానివి, నువ్వు చూడకూడని రహస్యాలేమీ ఉండవు వీటిల్లో" అంది శ్యామల, ఆ ఉత్తరాల్ని సునంద కందించబోతూ. ఆ మాటకి తెల్లబోయింది సునంద.

మనిషి ఎంత స్వార్థపరుడో అంత యుక్తిపరుడు కూడా. ఉన్న సమయంలో నెత్తిని ఎత్తి ఊరేగించ గలడు. లేదని తెలిస్తే పడదోసి పారిపోగలడు. వీటితో విండిన చెరువులో కప్పలు చేరటం వింతేం కాదు. దూషించిన నోరే భూషిస్తూంటే వింతేకదూ మరి!

తన సంకుచిత స్వభావానికి సిగ్గిలుతూ 'అక్కయ్య మాటల్లో ఇంత మంచితనం, తీపి, స్నేహశీలత ఉంటాయా' అను కుంది. పైకి నవ్వేస్తూ— "సరదా కన్నా నలా. క్షమించండి, శ్యామలా" అని తన సీట్లోకి వెళ్లిపోయింది సునంద.

శ్యామల చిరునవ్వుతో ఒక కవర్ని చించింది.

ఆ ఉత్తరం మామగారు వ్రాశారని గ్రహించిన శ్యామల వదనం క్షణంలో కఠినంగా మారిపోయింది.

"నా కొడుకుతోపాటే నువ్వూ దూర మైపోయావు. నిన్నూ, నీ సంతానాన్ని పోషించాల్సిన అవసరం నా కేమీ లేదు. నీ కన్నవారికి తప్పదు— అక్కడికి పో." ఆ రోజు భర్త పోయి పుట్టెడు దుఃఖంలో ముందు దారి ఏమిటి భగవంతుడా అని వాపోతుంటే, తనని ఓదార్చడం పోయి, తన మనసుకి ధైర్యం ఇవ్వడం పోయి, తన బరువూ, తన బిడ్డల బాధ్యతా ఎక్కడ మీద పడతాయో అని ముందుకి ముందే తన కాళ్లకి సంకెళ్లు వేశాడు మామగారు. కొడుకు పోతే కొడుకు పెళ్లాన్ని, బిడ్డల్ని పోషించాల్సిన బాధ్యత వాడి కాదు సుమా అనే భావాన్ని వ్యక్తం చేసి తనని నిర్దాక్షిణ్యంగా, నిస్సహాయంగా వదిలివేసిన మామగారిప్పుడు ఏ మొహంతో, ఏ బంధంతో ఉత్తరం వ్రాశాడో? ఇన్నాళ్లూ తనేమైపోయిందో అక్కర్లేని పెద్దమనిషికి ఇన్నాళ్ల తర వాత తన ఉనికి గుర్తు వచ్చింది కాబోలు. తన యోగక్షేమాలు విచారించాల్సిన అవసరం కలిగిందన్న మాట ఇన్నాళ్లకి.

ఆ ఉత్తరం చదువుతున్నంతసేపూ ఆమెకు గుండెల్లో మంట తీవ్రరూపం దాలుస్తూనే ఉంది.

దాన్ని చించి ముక్కలు చేయాలనేంత ఉద్రేకం పొంగిం దామెలో.

రెండో కవరు తీస్తూ చిన్నగా నవ్వుకుం దామె—'ఈ ఉత్తరం ఎవరు వ్రాశారో?' అనుకుంటూ.

"ప్రియమైన శ్యామలకు,

మీ వదిన ఆశీర్వదించి వ్రాయునది."

అంతవరకూ చదివిన శ్యామలకు ఆ ఉత్తరం వ్రాసింది ఎవరో తెలిసి పోయింది. ఇక దాన్ని చదివే పని లేదు అనుకుంది దాన్ని ఓ పెడగా పెట్టుతూ.

బహుశా తనకు మంచి చెడ్డలు మారి పోస్తూ రాసిందేమో? ఇన్నాళ్లకైనా ఆమె మనసు మారి తనకు ఉత్తరం వ్రాసి నందుకు సంతోషంగానూ ఉంది; మరిచి పోలేక పోని ఆమె నీచ స్వభావాన్ని తలుచు కుంటే అసహ్యంగానూ ఉంది.

'ఆమెకు తనమీద ఇంత అపేక్ష కలగడానికి కారణ మేమిటో?

తన మీద అసహ్యమైన, అవమాన కరమైన నిందలు ప్రచారం చేస్తూ తనని ఎప్పటి కప్పుడు వెన్నుపోటు పొడుస్తూ, చివరికి ఆ ఇంటి నుంచి దూరం చేసింది ఈ వదినే కదూ? అయినా, గతం మరిచి ఎలా వ్రాయ గలిగిందో? ఏ ఎండ కా గొడుగు పట్టే వారంటే వదిన లాంటి వారే కాబోలు? తను తీవ్రంగా ద్వేషించే వారిలో ఈ వదిన ఒకర్తి. అయినా, ఏమని వ్రాసిందో ఒక్కసారి చూస్తే ...' కుతూహలంతో పక్కన పడేసిన ఉత్తరం తీసి గబగబా చదివేసింది శ్యామల. అది చదివాక పక్కున నవ్వాలనిపించిం దామెకు.

"ఇంత వయసు వచ్చాక చదువేమిటి, మతి లేక గాని! అయినా, ఆ చదివే చదు వేమిటో నాకు తెలుసులే. చదువువంకతో మగాళ్లని నేరుగా గదికి రప్పించుకోవ డాని కిదో రకం ఎత్తు. సిగ్గు లేకపోతే సరి, ఇద్దరు బిడ్డల తల్లికి ఇప్పుడు చదువు కావాల్సి వచ్చిందా? బి. ఎ. లు, ఎమ్. ఎ.లు పాసైన మగాళ్లకే ఉద్యోగాలు దొరక్క ఘోరిస్తుంటే, ఈవిడగారికి ఉద్యోగం ఇచ్చే దెవరు? ఈవిడకు బుద్ధి లేకపోతే పెద్దవాళ్లకైనా ఉండక్కర్లే బుద్ధి? కూతురు ఆడించినట్టల్లా ఆడతారు?" వదిన ఆ నాడు అన్న మాటలు గుర్తు చేసుకుంటే ఈనాడు గుండె కలుక్కు మంటుంది. శూలాల్లాంటి మాటల్ని ఎవరుమాత్రం మరిచిపోగలరు?

ఇద్దరు పిల్లలతో, పోషించే నాధుడు పోయి, వెనకాల ఆస్తిపాస్తులు లేక భవి ష్యత్తు అంధకారమయంగా కనిపిస్తూ తను అల్లాడిపోతుంటే 'మెట్రికు లేషన్ పరీక్షకు కూర్చోండి, శ్యామల గారూ. కనీసం ఆ హోదా అయినా ఉంటే అటు టైపన్నా నేర్చుకోవచ్చు. టీచర్ ట్రెయినింగుకైనా వెళ్ళచ్చు. అలా అయితే, మీ కాళ్లమీద మీరు ధైర్యంగా నిలబడగలరు. మీ పిల్లల్ని మీరు పోషించుకోగలరు. అప్పుడిక ఎవరి అండ దండలూ అక్కర్లేదు' అని ఆ రోజు తనని ఊరడిస్తూ ధైర్యం చెప్పాడు, సుశీల భర్త వెంకట్రావు. తనకి జీవితం మీద ఆశ చిగురించేలా చేసింది అతనే. ఆ నాడు అతనేగాని అలా బోధించి ఉండకపోతే తనేం అఘాయిత్యం చేసేదో తనకే తెలియదు.

అన్న తరవాత అన్నలాంటి వాడు అనే భావంతో తను అతని దగ్గర చదువు చెప్పించుకుంటుంటే, తనకి, అతనికి మధ్య నీచమైన సంబంధం అంటగట్టి దుష్ప్ర



చారం చేసింది వదిన. ఆమె మాటలన్నీ నిజమని నమ్మిన అన్నయ్య, నాన్న తనని అనుమానంగా చూసేవారు.

భర్త ఉండగా తనని ఎంతో గౌరవంగా, ఆప్యాయంగా, అభిమానంగా చూసుకున్న తండ్రి, తోబుట్టువు తన విలువ మారిపోగానే అలా ఎలా మారిపోగలిగారో?

భర్త పోయిన ఆడదాని విలువ ఆ భర్తతోనే పోతుంది కాబోలు! 'మొగుడు చచ్చిన ముండకి చదువెందుకు, అలా పడి ఉండక' అన్నట్లు మాట్లాడే వదిన గతాన్ని విస్మరించి ఎంత ప్రేమాభిమానాలు గుమ్మరిస్తూ వ్రాసిందో!

"నువ్వు అదృష్టవంతురాలివి, శ్యామలా. అందుకే భగవంతుడు నీకో దారి చూపెట్టాడు. ఈవేళ స్వశక్తితో నువ్వు బ్రతకగలుగుతున్నావంటే, నాకెంత సంతోషంగా, గర్వంగా ఉందో నీకేం తెలుసు? మగవాడిలా మా శ్యామల కూడా ఉద్యోగం చేస్తున్నది సుమా! అనుకుంటే నాకు, మనసు కెంతో తృప్తిగా ఉంది. అసలు ఆడవారికి కనీసం కొంత చదువైనా ఉండాలి, శ్యామలా. లేకపోతే నిరాధారంగా నిలబడిన ఆడది బ్రతకలేదు. అందుకే నీ మేనకోడళ్లను కూడా మగపిల్లలతో సమానంగా చదివించాలనుకుంటున్నాము. నీ అభిప్రాయం ఏమిటి? చదివించమంటావా?" అంటూ వ్రాసింది ఆమె.

ఆ ఉత్తరాన్ని మడిచేస్తూ అనుకుంది శ్యామల: 'నా ఉద్యోగం తలుచుకుని నువ్వే పొంగిపోతున్నావు గాని, మగవారి మధ్య బిడియపడుతూ ఈ ఉద్యోగం వెలిగించే నేను మనసులో ఎంత బాధపడుతున్నానో, ఎంత భయపడుతున్నానో, ఎంత సిగ్గుపడుతున్నానో నీ కెలా తెలుస్తుంది? నీకు తెలిసింది నేనూ మగవాడిలా ఉద్యోగం చేస్తున్నానని, నెలయ్యేసరికి కొన్ని రూపాయలు పంపిస్తున్నానని. అంతే.

ఇంటి పట్టున ఉండి; భర్త సంపాదించి తెస్తుంటే, పిల్లల్ని సక్రమ పద్ధతిలో పెంచుకుంటూ, సంసారాన్ని చక్కబెట్టుకుంటూ ఉండే నీకన్నా అదృష్టవంతు లెవరున్నారు, వదినా?'

వరసగా మూడో ఉత్తరం తీసి చదివిన శ్యామల దీర్ఘాలోచనలో పడిపోయింది.

ఆ ఉత్తరం పెద్దాడపడుచు ఇందిర వ్రాసింది. 'పుట్టింటి వారు ఉన్నారని పేరే గాని, పట్టుమని పది రకాల సరుకైనా తెచ్చుకుంది కాదు' అని వ్యంగ్యోక్తులు విసురుతూ ప్రతి క్షణమూ తన పుట్టింటి వారిని ఆడిపోసిన ఆడపడుచు, తనకి ఆడపిల్ల పుట్టినప్పుడు 'నీ కోడలు ఇదే నమ్మాయ్' అని అత్తగారంటే మొహం ముడుచుకుని 'ఇప్పట్నుంచి ఆ వెధవ చుట్టరికాలు పెట్టకమ్మా' అని తృణీకారంగా మాట్లాడిన ఆ ఆడపడుచే ఇప్పుడు — "నీకేం భయంలేదమ్మా, మరదలా. నీ కూతుర్ని నా కొడుక్కి చేసుకుంటాను సుమా!" అని వ్రాస్తూ, "తమ్ముడు పోబట్టి నీ బ్రతుకిలా అయింది కాని, వాడే కనక ఉంటే నీకీ తిప్పలుండేవా? కలిమి లేములు కావడి కుండలు, తెలుసా? చిన్నాన్న చెప్పారు నీవేదో ఆఫీసులో పని చేస్తున్నావని. నీ పిచ్చి గాని, ఎవరి దగ్గర ఉంటే నీది, నీ పిల్లల్ని పొట్ట గడవదా? నీవు కష్టపడాలా? అయినా, పోనీలే. నీ కంటూ ఓ గమ్యం దొరికింది. ఎలాగైనా తెలివిగల వాళ్లు తెలివిగల వాళ్లేను. స్వయం కృషితో నీ కాళ్లమీద నువ్వే నిలబడగలిగావు. అందుకు నాకు సంతోషంగా ఉంది; ఈర్ష్యగానూ ఉంది. కష్టపడి చదువుకున్నావు. నమ్మిన మార్గంలో నడుస్తున్నావు. నిన్ను ఎలా ప్రశంసించాలో తోచడం లేదు.

మేమూ ఉన్నాము — ఎందుకూ? ప్రతి చిన్న పనికీ మగాడి మీద ఆధారపడుతూ. ఆ మునిమయ్యా, ముక్కుందం ఈమధ్యే పి. యు. సి. పాసైనాడు. వాడి నింక చదివించలేనంటున్నారు నాన్న. వాడికి మీ ఆఫీసులో ఏదైనా పని చూడరాదూ? మళ్లీ మీరంతా కలిసి ఓ చోట ఉండవచ్చు హాయిగా" అంటూ వ్రాసిందామె. ఆ ఉత్తరం పూర్తిచేసి విరక్తిగా నవ్వుకుంది శ్యామల.

'తను ఇన్నాళ్లూ అల్లాడిపోతుంటే, ఈ ఆడపడుచులుగాని, పిన మామగార్లు కాని దగ్గర పెట్టుకుని ఆదరించారా? తనని దగ్గరకు రానిస్తే తన దరిద్రం వాళ్ల కెక్కడ అంటుతుందో అని భయపడిపోయారు కదూ? అసలు శ్యామల అనే ఆడది, భర్త పోయి ఇద్దరు పిల్లలతో చేరదీసి ఆదరించేవారు లేక అల్లాడిపోతున్నదని ఆ రోజుల్లో ఒక్కరైనా అనుకున్నారా? సానుభూతితో ఆదరించారా? ఈ రోజు తనని ఎవరూ ఆదరించే పని లేకుండా స్వయంకృషితో ఉద్యోగస్థురాలయింది. అందుకనే కాబోలు, తన వాళ్లు, తన ఆత్మీయులు, తన బంధువులు అనే వాళ్లంతా, ఏ ఎండకా గొడుగు పట్టే ఈ స్వార్థపరులు ఈ వేళ ఒక్కసారిగా ఎక్కడలేని ఆప్యాయతా, అభిమానం గుమ్మరిస్తూ ఉత్తరాల ద్వారా తమ స్వభావాల్ని వ్యక్తం చేసుకున్నారు. మనిషి ఎంత స్వార్థపరుడో, అంత యుక్తిపరుడు కూడాను. గాఢంగా నిట్టూర్చిన శ్యామల నాలుగో ఉత్తరాన్ని, ఆఖరి ఉత్తరంగా మిగిల్చినదాన్ని చేతిలోకి తీసుకుంది.

పది రోజుల నాడు తను పని ఉండి బజారు కెళితే అక్కడ కనిపించాడు చిన మామగారు. 'ఇక్కడ ఉన్నావేమిటే' అని ఆశ్చర్యంగా అడుగుతుంటే తను ఆ ఊళ్లో ఒక ఆఫీసులో ఉద్యోగం చేస్తున్నట్లు, పిల్లల్ని హాస్టల్లో పెట్టి చదివిస్తున్నట్లు చెప్పింది గర్వంగా.

ఆయన లేవదీసిన దుమార మన్న మాట ఇది. ఆ రోజు ఆయన వెళుతూ వెళుతూ "కృష్ణ, మూర్ఖం ఉద్యోగాల కోసం చూస్తున్నారే, అమ్మాయీ. నీకు వీలుంటే వాళ్లిద్దర్నీ మీ ఆఫీసులో పడేలా చేద్దూ, పుణ్యం ఉంటుంది. పెద్ద పిల్ల సరోజ ఎదిగి గుండెల మీద కుంపటిలా కూర్చుంది. ఏమిటో ఒక్కడి సంపాదనతో పిల్లల్నే చదివించనా, ఎదిగిన పిల్లలకు పెళ్లిళ్లే చేయనా? పోనీ, ఆడపిల్లల్ని స్కూలు ఫైనల్ దాకా అయినా చెప్పించామకాదు. వాళ్ల పెళ్లికి కట్నం వాళ్లే సంపాదించుకునేవాళ్లు" అని విషాద స్వరంతో చెపుతుంటే తన స్త్రీ హృదయం ద్రవించిపోయింది. అతనికి పిల్లలెక్కువ. అంతా తినే వయసువారే కాని, సంపాదనపరు లొక్కరూ లేరు. ఆ సమయంలో అతని మీద ఎంత జాలి వేసిందో! 'ఆ పిల్లల్ని ఇక్కడకు పంపించండి. నెమ్మదిగా ఏదో ఒకటి చూడవచ్చు' అందా మనుకుంది. కాని, అంతలోనే మనసు మేలుకొంది— కసిగా ఉపడించుకొంది. 'ఇప్పుడీయన్ని చూసి జాలి పడుతున్నావుగాని, ఎప్పుడన్నా నిన్నుగాని, నీ పిల్లల్నిగాని తీసుకెళ్లి పట్టెడన్నం పెట్టి ఎరుగునా... ఎందుకొచ్చిన మొహర్బానీ గాని, నీ మానాన్న నీవు పడి ఉందూ! ఈ వేళ నీ మీద ఇంత ప్రేమ చూపిస్తున్నారంటే ఇదంతా నిన్ను చూసి అని పొంగిపోకు. నిన్ను చూసికాదు, నువ్వు చేసే ఉద్యోగం చూసి, నువ్వు పొందుతున్న గౌరవం చూసి




వెలుగు రేకలు

చిత్రం—శారథి (మద్రాసు-44)

దగ్గరకు రావడానికి ప్రయత్నిస్తున్నారు సుమా జాగ్రత్త' అని హితబోధ చేసింది మనసు.

**అవును.** ఆ మాటా నిజమే. పుట్టెడు దుఃఖంలో మునిగి ఎటు చూసినా అంధకార మయంగా కనిపించే భవిష్యత్తులోకి భయంగా చూస్తూ కుమిలిపోతున్న తరుణంలో 'నే మున్నాను, రా. నీకు, నీ పిల్లలకు వచ్చిన భయం లేదు' అని ఎవరన్నా తనకి ధైర్యం చెప్పారా? పైగా, ఎన్నో నిందలు, మరెన్నో అపవాదులతో తనని ప్రతిక్షణమూ బాధపెట్టడానికే చూశారు, తన వాళ్ళు, తన సంబంధీకులు అనుకున్న వారే. ఈ రోజు తను స్వతంత్రంగా బ్రతకగలుగుతున్నది. అందుకే వాళ్ళ మనసుల్ని ఇటు మళ్ళించుకున్నారు.

నాలుగో ఉత్తరాన్ని చదవసాగిం దామె. వంకర టింకర అక్షరాలతో, మధ్య మధ్య కొట్టివేతలతో నిండి ఉం దా ఉత్తరం. ఆ వ్రాత శ్యామలకు పరిచయమైనదే. సంతోషం ఉప్పొంగే హృదయంతో ఇలా చదువుకుంది:

"ప్రియమైన శ్యామలకు—ఆశీర్వదించి వ్రాయునది."

అంతవరకూ చదివిన శ్యామల అనుకుంది మనసులో — 'నీ ఆశీర్వాదం ఉండబట్టే నే నింతదాన్ని కాగలిగానమ్మా' అని.

"ఇప్పటికైనా నీవు నీ కాళ్ళమీద నిలబడగలిగినందుకు నాకు చాలా ఆనందంగా ఉందమ్మా ..."

**బిడ్డల భవిష్యత్తు గురించి ప్రతి తల్లీ ఆరాటపడుతుంది.** ఆశల్ని పెంచుకుంటుంది. ఆ బిడ్డ సక్రమ మార్గంలో నడుస్తూ ఉన్నత దశలో కెళుతుంటే అమితంగా ఆనందిస్తుంది. ఆ బిడ్డ విధిచేత వంచించబడి కుమిలిపోతుంటే చూసి ఆవేదన పడుతుంది. 'నీవు నా తల్లివి. విధిచేత వంచించబడిన ఓ అబలకు తల్లివి. ఆశ్రయం కోల్పోయిన దురదృష్టవంతురాలైన బిడ్డని చూసి ఏ తల్లి బాధపడదూ? అంతకంటె ఎక్కువ బాధే అనుభవించావు నువ్వు. ఈ రోజు నేను స్వయంకృషితో బ్రతుకుతున్నానంటే, అందుకు నీ విచ్చిన ధైర్యమే కవచంగా నన్ను తీర్చి దిద్దింది.' ఎక్కడో ఉన్న తల్లిని తలుచుకుంటూ ఉన్న శ్యామలకు కన్నీరు పొంగుకొచ్చిం దొక్కసారిగా. దుర్బల శరీరురాలైన తల్లి రూపం మనోనేత్రం ముందు తళుక్కుమంది.

ఆదుర్దాగా ఉత్తరంలో అక్షరాలు వెతుక్కుం దామె. "ఆత్మస్థైర్యం, పట్టుదల, ధర్మ చింతన ఉన్న వాళ్ళు ఎప్పుడూ పైకి వస్తారమ్మా. నీ భవిష్యత్తు, నీ బిడ్డల భవిష్యత్తు కూడా నీ చేతిలోనే ఉంది. నేను ఎక్కడ ఉన్నా సదా నీ క్షేమాన్నే కాంక్షిస్తూ ఉంటాను. ఆశీర్వచనములతో. . . మీ అమ్మ."

ఉత్తరం చిన్నదే కాని, ఆ కొన్ని వాక్యాల్లోనే ఎంత సంతోషం, ఎంత బాధ నిక్షిప్తమై ఉన్నాయో శ్యామలకు తెలుసు.

తల్లికి పుట్టిన బిడ్డలందరూ ఒకేలా ఉండరు. అందరి జీవితాలూ ఒకేలా జరగవు. పచ్చికాయ బద్దలై పోయినట్లు అల్లుడు పోయి, ఇద్దరు పసివాళ్లతో నిరాధారంగా మిగిలిపోయిన కూతుర్ని చూసి ఆ తల్లి గుండె పగిలిపోయింది. 'అటు అత్తవారి ఆదరణ లభించక, ఇటు కన్నవారు చేరదీయక పోతే ఎలా?' అని పట్టుపట్టి ఆ కూతుర్ని దగ్గర పెట్టుకుం దా తల్లి. కాని, ఆ ఆదరణ ఎన్నాళ్లో ఇవ్వలేకపోయింది. జీవితాధారంకోసం చదువుకోబోతే 'మగ వాళ్లతో సరసాలాట్టాని కిదో నెపం' అని కోడళ్ళు యాగీ చేస్తుంటే వాళ్లకు వంత పాడుతూ కొడుకులు, ఆ రాబందుల మధ్య బ్రతకలేక ఆ కూతురు అనాథ శరణాలయానికి వెళ్లిపోతుంటే ఎంత బాధపడిపోయిందో ఆ తల్లి! 'కన్న కూతురు దిక్కులేని దానిలా ఉంటే ఏ తల్లి భరించగలదూ? అంతకన్న ఘోరం ఇంకేమిటి? కాని, ఆమెకు ఆ వ్యథ భరించక తప్పలేదు. అడుగడుక్కీ అన్నా, వదినల హేళన, ఎత్తిపొడుపులు భరించే కన్న ఎవరూ లేని అనాథలా బ్రతకడానికే నిశ్చయించుకున్న శ్యామల అభిప్రాయాన్ని ఆమె మార్చలేకపోయింది. తను వచ్చేస్తుంటే కన్నీటితో సాగనంపిన మాతృమూర్తి రూపమే మెదులుతుంది మనసులో. ఆ రూపం గుర్తొస్తే శ్యామల మనస్సు వికలమై పోతుంది.

కష్టపడి చదివింది. అందు కీవేళ గర్వపడుతూ తలఎత్తుకు తిరుగుతున్నది. 'నాకు పిల్లలున్నారు. వాళ్లకోసం, వాళ్ల భవిష్యత్తుకోసం నే నేమైనా సాధించగలను. అదే నా ధ్యేయం. చీకటి లాంటి నా ఎడారి జీవితంలో నా పిల్లలే ఒయాసిస్సులు; వెలుగురేఖలూను' అనుకుంది శ్యామల గుండె ధైర్యంతో. ఆ నాలుగో ఉత్తరాన్ని మడిచి పర్సులో జాగ్రత్త చేసుకుని, తతిమ్మా మూడు ఉత్తరాల్నీ ముక్కలు ముక్కలుగా చించి వేస్ట్ పేపర్ బాస్కెట్‌లో పడేసింది. అప్పటికిగాని ఆమె మనసు శాంతించలేదు.

ఎప్పుడో చిన్నప్పుడు చదువుకున్న పద్యం 'ఎప్పుడు సంపద గలిగిన' అన్నది చటుక్కున గుర్తొచ్చిం దామెకు. నవ్వుకుంది చిన్నగా, అక్షరాలా అలాగే జరుగుతున్నది సుమా అనుకుంటూ. *



శిథిల జీవితం

ఫోటో—ఎస్. జి. శేషగిరి (కోయంబత్తూరు-2)